

ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర

## (కోడవల్లిలో శ్రీనాన్న గారి ప్రవచనము, 16-5-98)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మీ హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది. దానికి, ఈశరీరానికి ఇసుమంతయు సంబంధములేదు. లోపల ఉన్నవస్తువుకి కదలికలేదు. కాని మన శరీరం యొక్క కదలికను దాని మీద ఆరోపించుకొంటున్నాము. లోపల ఉన్న కదలికలేని వస్తువు అనుభవంలోనికి వచ్చాక నీకు కదలిక లేదు, చావులేదు, పుట్టుకలేదు, అన్న సంగతినీకు తెలుస్తుంది. లోపలఉన్న సత్యం నీకు తెలిసేవరకూజన్మలు తప్పవు, దు:ఖం తప్పదు. నీ హృదయంలో ఉన్న సత్యం నీకు తెలియాలి. అదే చివరి స్థితి. మనహృదయంలో ఉన్న పరమసత్యంను తెలుసుకోవటానికి ఎవరైతే సహాయంచేస్తున్నారో వారితోనే నీవు సహవాసం చెయ్యి. లోకంలో అనేక లోపాలు, పొరపాట్లు, బలహీనతలు ఉన్నాయి కాని చెడుసహవాసాలు లోకంలో పెద్దపొరపాటు అనిచెప్పారు. నీవు అందరిని ప్రేమించుకాని అందరిని నమ్మవద్దు. లోకంలో కొంతమందే నమ్మదగినవారు ఉంటారు. నమ్మదగనివారిని నమ్మితే నీవు కష్టాలలో పడతావు. నమ్మినవారికి నీవు ఉపకారం చేయవచ్చు. నమ్మనివారికి నీవు ఉపకారంచేయకపోయినా అపకారం మాత్రం చేయకు. వివేకమును పోగొట్టుకోవద్దు. వివేకమును సరిగా పోషించుకోకపోతే తత్వం నీకు తెలియదు.

వ్యక్తి భావన, స్వార్ధం ఇవిరెండూ స్నేహితులు, వ్యక్తిభావన పెరుగుతూ ఉంటే స్వార్ధం పెరుగుతుంది. స్వార్ధం పెరుగుతూ ఉంటే వ్యక్తి భావన పెరుగుతుంది. వ్యక్తి భావన లేకుండా మనం పని చేస్తూఉంటే, వ్యక్తి భావన లేకుండా మాట్లాడుతూ ఉంటే మీకు స్వార్ధం తగ్గుతుంది. ఇవి రెండూ నశిస్తేనేగాని లోపలఉన్నతత్వం మనకు తెలియదు. కొంచం స్వార్ధం తగ్గించుకొని పనిచేసినా మరణానంతరజీవితంలో అది నిన్ను కాపాడుతుంది. మనిషి వ్యక్తిభావనతో పని చేస్తాడు. పనిచేస్తే ఫలితంవస్తుంది. మంచి పనిచేస్తే మంచిఫలితం, చెడుపని చేస్తే చెడ్డఫలితం వస్తుంది. ఇవి రెండూ అనుభవించేది నీ అహంభావనే. వీటితో నీలోపల ఉన్న సత్యవస్తువుకు ఏ మాత్రం సంబంధం లేదు అన్నారు భగవాన్. నన్ను ఏమని అనుకోమంటారు అని ఒక భక్తుడు భగవాన్‌ను అడిగాడు. రామ, కృష్ణ, శివ అని ఏదో భగవంతుని పేరు చెపుతారు అని ఆభక్తుడు అనుకొన్నాడు. కాని భగవాన్ అలా చెప్పలేదు నీవు ఎవడిగా ఉన్నావో వాడిగా ఉండాలని అనుకో అని భగవాన్ చెప్పారు.

నీవు పని చేస్తావు పనివలన ఫలితం వస్తుంది. ఆఫలితాన్ని అనుభవిస్తావు అప్పడు వాసన పడుతుంది. వాసనలోనుండి తలంపు వస్తుంది. ఆ తలంపునుబట్టి మరల పనిచేస్తావు ఇది కర్మచక్రం. నీ తెలివి వలన, నీ సాధన వలన ఈకర్మచక్రంలోనుండి బయటకురాలేవు. ఒక మహాజ్ఞాని యొక్క,

మహాగురువు యొక్క సహకారంవలన ఈ కర్మచక్రంలోనుండి బయటకు రాగలవు గాని కేవలము నీసాధనవలన ఇందులోనుండి బయటపడలేవు. ఇప్పుడు నేను ఎలా ఉన్నానో అలాగ ఉండటానికి కారణం నా తెలివికాదు, నా సాధనకాదు, నేను ఇలా ఉండటానికి నీ అనుగ్రహమే కారణం అని అరుణాచలేశ్వరునితో భగవాన్ అన్నారు. ఎక్కడ వాసనలు లేవో, తలంపులు లేవో అక్కడ నిలబడి ఉండు. వాసనలు వాటి అంతట అవే రాలిపోతాయి ఎంత కాలం అలా ఉండమంటారు అని అడుగుతున్నారు. వాసనలు పూర్తిగా నశించే వరకూ వాసనలు లేని స్థానంలో నిలబడి ఉండు. వాసనలు పూర్తిగా నశించిన తరువాత వస్తువు నీకు తెలుస్తుంది. నీకు దేహం ఎంత స్పష్టంగా తెలుస్తోందో అంత స్పష్టంగా వస్తువు నీకు అనుభవంలోనికి వస్తుంది. నిద్రావస్థ, స్వప్నావస్థ, జాగ్రదావస్థ, ఇవి మూడు నిజం కాదు అని జ్ఞాని చెప్పినా జ్ఞానం లేని వాడికి అది అర్థం కాదు. నీ హృదయంలో ఉన్న సత్యవస్తువు నీకు అనుభవంలోనికి వచ్చాక ఈ మూడు అవస్థలు నిజం కాదు అని నీకు స్పష్టంగా తెలుస్తుంది. నీకు ధృఢమైన వైరాగ్యం, అభ్యాసం ఉండాలి. విచక్షణాజ్ఞానం ఉండాలి. ఏది సత్యం, ఏది అసత్యం అనే విచక్షణ ఉండాలి. ఇవి లేకుండా నీవు హృదయంలో ఉండలేవు. విచక్షణాజ్ఞానం లేకపోతే నీకు తత్వం తెలియదు. నిన్ను ఎవరైనా పొగడినా, నిందించినా వారు పొగడక ముందు, నిందించక ముందు నీ మనస్సు ఎలా ఉందో తరువాత కూడా అలాగే ఉండాలి. అలా ఉండకపోతే నీ మనస్సు హృదయంలో ఉండదు.

మీరు చెడ్డ స్నేహాలు చేస్తూ ఉంటారు. మీరు మంచివారు అయినట్లు ఆ చెడ్డ స్నేహితులను తిడతారు. మీకు తెలియకుండా మీలో దానికి సంబందించిన బలహీనత ఉంది కాబట్టి చెడ్డ స్నేహాలు చేస్తున్నారు. మనలో చెడ్డలేకపోతే ఆ చెడ్డ స్నేహాల మీద ఆకర్షణ ఉండనే ఉండదు. పోగొట్టుకోవలసినది పోగొట్టుకొంటే మిగిలేది తానే. నీవు కాని దానిని త్యాగంచేస్తే మిగిలేది దేవుడే, సత్యమే, మహావెలుగే, ఆ మహావెలుగులో నీ మనస్సు ఐక్యమయిపోతుంది. దానిని ఏకాగ్రతతో, పవిత్రతతో సాధించాలి. అనన్యభక్తితో సాధించాలి. నీ సాధన వలన నీలో ఉన్న అహంకారము పోదు దానికి గురువు దెబ్బ తగలాలి. గురువు దెబ్బకు అది రాలిపోతుంది. హృదయంలో ఉన్న సత్యమును అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ఎవడైతే ప్రయత్నంచేస్తున్నాడో వాడే ఉన్నతమైన సాధకుడు.

ఎవరైనా మనలను సలహా అడిగారు అనుకోండి మన నోటికి వచ్చినట్లు చెప్పకూడదు. వారు ఏ కష్టంలో ఉన్నారో అదే కష్టం మనకు వస్తే మనం ఎలా ప్రవర్తిస్తామో చూసుకొని అదిచెప్పాలి. మన అహంభావన తనకు తాను నీతులు చెప్పకోదు. ఇతరులకు నీతులు చెప్పమంటే చెపుతుంది. అహంభావనను, నేను అనే మొదటి తలంపును పోగొట్టుకోవటానికి ఎంత వరకు ప్రయత్నం చేస్తున్నారు. నేను అనే మొదటి తలంపే మొదటి పాపం, ఈ మొదటి పాపాన్ని తొలగించుకోవటానికి ఎంత మంది సిద్ధంగా ఉన్నారు. ఈ మొదటి పాపం వలననే మనం భగవంతుడి నుండి వేరుపడి పోయాము. ఆ మొదటి పాపాన్ని విడిచిపెట్టకుండా భగవంతునిలో మనం ఐక్యం అవ్వలేము. నేను అనే మొదటి తలంపును మొగ్గలోనే గిల్లివెయ్యి. బీజంలో ఉండగానే దానిని తీసివేయటానికి ప్రయత్నం చెయ్యి.

అది విజృంభించిందా దానిని నీవు తొలగించలేవు. భగవంతుడు అంతటా ఉన్నాడు, అంతర్యామిగా ఉన్నాడు. అందువలన ఆయనకు తెలియని విషయం అంటూ ఏమీ ఉండదు. నీ ఇంద్రియముల కంటే, నీ మనస్సు కంటే నీ దేహము కంటే దగ్గరగా ఉన్నాడు. మన అజ్ఞానం ఎంత దట్టంగా, లోతుగా, బలంగా ఉంది అంటే దేహం యొక్క చావును, పుట్టుకను, నీ గుణాలను నీ హృదయంలో ఉన్న సత్యం మీద ఆరోపించుకొంటున్నావు, కాని నీహృదయంలో ఉన్న సత్యానికి వీటికి ఏవిధమైన సంబంధం లేదు. హృదయంలో ఉన్న సత్యవస్తువు నీకు అనుభవం అయ్యేవరకు ఈ విషయం నీకు తెలియదు. మనకు ఏది మంచిదో మన కంటే భగవంతుడికి బాగా తెలుసు. భగవంతుడిని స్మరిస్తూ ఉంటే ఆయనను తెలుసుకోవటానికి ఏదైతే నీకు అడ్డుగా ఉందో దానిని తొలగిస్తాడు. భగవంతుడిని స్మరిస్తూ ఉంటే నీవు పవిత్రుడవు అవుతావు. మూలతలంపు నశిస్తుంది. హృదయంలో ఉన్న సత్యం నీకు తెలుస్తుంది.

లోకంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. ఏ సంఘటనకు ఉద్రేకపడకుండా చూసుకో. ప్రతీ సంఘటనకు ఉద్రేకపడుతూ ఉంటే నీ స్వరూపానికి దూరమవుతావు. నీ దేహప్రారబ్ధాన్ని బట్టి సంఘటనలు జరుగుతూ ఉంటాయి. నీవు దేనికి ఉద్రేక పడవద్దు. గురువు చెప్పేమాటలను శ్రద్ధగావింటే నీ మనస్సులో ఉన్న బాధ అంతా చల్లారిపోతుంది, నీ శరీరానికి ఏదైనా అనారోగ్యం ఉన్నా మనస్సు శాంతితో నిండిపోతుంది అదే గురుస్వామి మీకు ఇచ్చే అనుగ్రహం. లోకంలో మీరు ఉండవచ్చు, దానితో మీకు అనుబంధం ఉండదు. దేహంలో మీరు ఉండవచ్చు కాని దానితో మీకు అనుబంధం ఉండదు. శరీరం ఉన్నా లేకపోయినా, లోకం కనిపించినా కనిపించకపోయినా ఏదైనా మీరు సమానంగా ఉంటారు. అటువంటి పరిస్థితిని మీకు గురుస్వామి అనుగ్రహిస్తాడు.

గురువు చెప్పిన మాటలు, భగవంతుడు చెప్పిన మాటలు, శాస్త్రంలోని మాటలు వింటాముగాని ఆమాటలు యొక్క విలువ మనకు తెలియదు. మనలో ఉన్న దేహబుద్ధి ఆ మాటల యొక్క విలువ తెలియకుండా ఆపుచేస్తుంది. అందుచేత సద్బుద్ధిని ప్రసాదించమని దేవిని ప్రార్థించటం అదే గాయత్రీ మంత్రం. నాకు సద్బుద్ధి ఉంటే కదా ఆ మాటలు యొక్క విలువనాకు తెలిసేది. నాకు సద్బుద్ధి లేకపోతే గురుస్వామి చెప్పే మాటల యొక్క విలువ తెలియదు, దాని లోతులు తెలియవు, ఆ మాటలకు అనుగుణంగా జీవించాలనే సంకల్పం నాలో ఉదయించదు. నీవు పూజచేస్తావో, జపం చేస్తావో, ధ్యానంచేస్తావో, ఏ గురువును ఆశ్రయిస్తావో ఏది చేస్తావో చెయ్యి నీ లోపల ఉన్న సంస్కారములను బయటకు గెంటివెయ్యి. జన్మ జన్మల నుండి మోసుకొనివస్తున్న సంస్కారములను బయటకుగెంటివెయ్యి వాటిని బయటకు గెంటలేదు అనుకో నీకు ముక్తి లేదు. అవి నీలోపల ఉన్నాయి. అవి అన్నీ కూడా సమాజమును చూసి నేర్చుకొన్న అలవాట్లేగాని అవి నువ్వుకాదు. బయట నుండి తెచ్చిపెట్టుకొన్నవే అవి నువ్వుకాదు. జన్మ జన్మల నుండి ఈ అలవాట్లు సంస్కారముల రూపంలో నీ లోపల ఉన్నాయి. నీకు ఇష్టమైన సాధన చేసుకో, ఇష్టమైన గురువును ఆశ్రయించు. నీ సాధన యొక్క శక్తి వలన, గురువు అనుగ్రహం వలన వాటిని బయటకు గెంటివేస్తే నీ హృదయంలో ఉన్న జ్ఞానం, పరమశాంతి నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది.